
ఆర్కే బీచ్ వద్ద కోతకు గురవుతున్న తీరం



విశాఖకు పొంచి ఉన్న ముప్పు

వాతావరణ మార్పులతో పెరుగుతున్న సముద్ర మట్టాలు

1992 నుంచి 2021 వరకూ 2.381 సెంటీమీటర్ల మేర పెరిగిన నీటి మట్టం

- ఏడాదికి సగటున 0.181 సె.మీ. పెరుగుదల
- 2040కల్లా తీరంలో 6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నీట మునిగే ప్రమాదం
- ప్రమాదంలో పోర్టు, తెన్నేటి పార్కు రుషికొండ, మంగమారిపేట బీచ్‌లు
- ముంబై తరువాత అత్యధికంగా విశాఖలోనే సముద్ర మట్టం పెరుగుదల
- బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థ అధ్యయనంలో వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): **వాతావరణ మార్పులతో సముద్ర మట్టాలు శరవేగంగా పెరుగుతున్నాయా?, ఈ పరిణామం దేశంలోని తీర నగరాలకు ముప్పుగా పరిణమించనున్నదా?, ఆ జాబితాలో విశాఖ నగరం కూడా ఉందా? అంటే... అవుననే అంటోంది బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ). 2040కల్లా తీర ప్రాంతంలో 1.02 శాతం (6.96 చ.కి. విస్తీర్ణం) నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది.**



భూతాపం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తీర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గడచిన 30 ఏళ్లుగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ అండ్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) ఇప్పటికే హెచ్చరికలు జారీచేసింది. ఈ క్రమంలో 2040 నాటికల్లా విశాఖపట్నం తీరంలో 1.02 శాతం భూభాగం నీట మునిగే అవకాశం ఉందని బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఈపీ) తాజా అధ్యయనం వెల్లడించింది. 1992 నుంచి 2021 వరకూ ఏడాదికి 0.181 సెంటీమీటర్ల వంతున మొత్తం 2.381 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టం పెరగడంతో తీరప్రాంతంలోకి చొచ్చుకు వచ్చింది. ఇదేవిధంగా 2040 నాటికి సముద్రమట్టం 16.7 నుంచి 18.3 సెంటీమీటర్ల మేర పెరిగే అవకాశం ఉందని, తీరంలో సుమారు 1.02 ప్రాంతం (6.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) ముంపునకు గురవుతుందని గత నెలలో విడుదల చేసిన అధ్యయనంలో సీఎస్‌టీఈపీ పేర్కొంది. 'సముద్ర మట్టాలు పెరిగి తీర ప్రాంతాలు ముప్పు' అన్న అంశంపై బెంగళూరుకు చెందిన సీఎస్‌టీఈపీ సంస్థకు చెందిన డాక్టర్ జె.అనూషియా, ఎం.సాయి వెంకటరమణ (ఏయూ ఓషనోగ్రఫీ పూర్వ విద్యార్థి), ఎంఎస్ ప్రదీప్, ఎస్.విద్యలతో కూడిన పరిశోధక బృందం దేశంలోని తీర నగరాలపై అధ్యయనం చేసింది. దేశంలో ముంబై తరువాత ఎక్కువగా హల్దియా, విశాఖపట్నం నగరాలే సముద్ర ముప్పునకు గురవుతాయని అధ్యయనంలో హెచ్చరించింది. విశాఖపట్నంలో పోర్టు నుంచి మంగమారిపేట వరకు తీర ప్రాంతంపై ఈ బృందం అధ్యయనం చేసింది. 2040 కల్లా తీరప్రాంతంలో 1.02శాతం (6.96 చదరపు కిలోమీటర్లు) నీట ... మిగతా 6వ పేజీలో

సామాజిక పింఛన్లు 97.23 శాతం పంపిణీ

- అత్యధికంగా పెందుర్తి మండలంలో 97.82 శాతం మందికి...


జోడుగుళ్లపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 1,63,210 మందికిగాను 1,58,686 మందికి (97.23 శాతం) గురువారం ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అత్యధికంగా పెందుర్తి మండలంలో 4,222కి 4,230 మందికి (97.82 శాతం), అతి తక్కువగా భీమునిపట్నం మండలంలో 6,161కి 5,940 మందికి (96.41 శాతం) పింఛన్లు అందజేశారు. ఉదయం ఆరు గంటలకు అప్పుఘర్, జోడుగుళ్లపాలెం ప్రాంతంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మహారాణిపేట ప్రాంతంలోని రంగిరాజు వీధిలో విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పింఛన్లు పంపిణీలో పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శోభారాణి, జీవీఎంసీ యూసీడీ పీడీ ఫణిరామ్‌లు పర్యవేక్షించారు. మిగిలిన వారికి పింఛన్లు శుక్రవారం అందజేయాలని నిర్ణయించారు.

సెంట్రల్ డ్రగ్ ఫార్మసీ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు

- వారం రోజులు షాపు మూసివేత
- ఉద్యోగులను వేధించే యాజమాన్యాలకు చెక్



సెంట్రల్ ఫార్మసీని మూసివేయించిన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

విశాఖపట్నం/మహారాణిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులను వేధిస్తే... ముఖ్యంగా మహిళలను ఇబ్బందిపెడితే ఉపేక్షించబోమంటూ జిల్లా అధికారులు హెచ్చరికలు పంపారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ముందుల దుకాణం 'సెంట్రల్ డ్రగ్ ఫార్మసీ' లైసెన్స్‌ను వారం రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేసి, షాపును మూసివేయించారు. సంస్థ అవకతవకలపై డ్రగ్ కంట్రోల్ అథారిటీతో విచారణ చేయిస్తున్నారు.

ఏమి జరిగిందంటే..?

పొరుగు జిల్లాల నుంచి వచ్చిన అమ్మాయిలు సెంట్రల్ డ్రగ్ ఫార్మసీలో ఉద్యోగానికి చేరారు. వారికి వసతి కల్పించి, అతి తక్కువ వేతనం ఇచ్చేవారు. పని భారం ఎక్కువ కావడం, పైగా యాజమాన్యం తరఫున పని చేస్తున్న కొందరు యువకులు లైంగికంగా వేధించడంతో పలువురు ఉద్యోగం ... మిగతా 6వ పేజీలో

పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజోతి): జిల్లాలో పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీచేశారు. మొత్తం 596 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారమే పాఠశాలల వారీగా ఓటర్ల జాబితాలను విడుదల చేశారు దీనిపై ఈనెల ఐదో తేదీలోగా అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఎనిమిదో తేదీ ఉదయం నామినేషన్లు స్వీకరించి, తరువాత మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తారు.

వీఎంఆర్‌డీఏలో అంతా గుట్టు!



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) గత ఐదేళ్లలో ఏమి చేసిందంటే చెప్పే నాథుడు లేడు. సంస్థ ప్రత్యేకంగా ఎప్పటి నుంచో నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌లో కొత్తగా వస్తున్న అధికారుల పేర్లు, ఫొటోలు, టెండర్ల ప్రకటనలు తప్ప ఇంకే సమాచారం ఉండడం లేదు. గతంలో బోర్డు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెబ్‌సైట్‌లో పెట్టేవారు. అధికారులు కూడా పత్రికా విలేకరుల సమావేశాలు నిర్వహించి, వివరాలు వెల్లడించేవారు. 2018 చివరిలో నిర్వహించిన బోర్డు సమావేశం తీర్మానాల వరకూ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఆ తరువాత ఏడాది 2019లో ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ప్రజలకు సమాచారం ఇవ్వడం నేరం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

గత ఐదేళ్లుగా లోపించిన పారదర్శకత

- బోర్డు నిర్ణయాలు వెల్లడించకుండా గోప్యత
- వెబ్‌సైట్ నిర్వహణలో నిర్లిప్తత
- టెండర్లకే పరిమితం
- ప్రజా సమాచారం శూన్యం
- కొత్త కమిషనర్ హయాంలోనైనా తీరు మారేనా?

వైసీపీ ప్రభుత్వంలో జారీచేసిన జీఓలు ఏవీ బయటకు వచ్చేవి కావు. వాటిని అప్‌లోడ్ చేయకుండా దాచిపెట్టేవారు. కనీసం అధికారుల బదిలీల జీవోలు కూడా బయటకు రానిచ్చేవారు కాదు. అమరావతి అధికారుల ఒరవడిని ఇక్కడ కమిషనర్‌గా ఉన్న కోటేశ్వరరావు అమలు చేశారు. బోర్డు సమావేశాలు, వాటి తీర్మానాలు ఏవీ బయటకు పెట్టకుండా గోప్యత పాటించారు. ఆయన హయాంలోనే వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2040 తయారుచేశారు. వైసీపీ పెద్దలు చెప్పినట్టుగా దానిని రూపొందించారు. వైసీపీలో రియల్ ఎస్టేట్



వ్యాపారం చేస్తున్న నాయకులకు మేలు జరిగేలా వివిధ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రహదారులు ప్రతిపాదించారు. వీటిపై ఎన్నడూ లేనంతగా పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు వచ్చినా లెక్క చేయలేదు. తీవ్రమైన విమర్శలు రావడంతో ఆ తరువాత కమిషనర్‌గా వచ్చిన వెంకటరమణారెడ్డి కొన్నింటిని పరిగణనలోకి తీసుకుని చిన్నచిన్న మార్పులు చేశారు. ఆయన కొద్ది కాలానికే వెళ్లిపోయారు. అప్పటి కలెక్టర్ మల్లికార్జునకు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఆయన మళ్లీ పాత పద్ధతినే పాటించారు. ఏ సమాచారం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. బోర్డు నిర్ణయాలు ఒక్కసారి కూడా వెల్లడించలేదు. గత ఐదేళ్లకు సంబంధించిన సమావేశాలు ఎక్కడ జరిగాయి?, ఎవరెవరు పాల్గొన్నారు?...అనే విషయాలు కూడా తెలియవు. గతంలో ఈ సమావేశాలన్నీ విశాఖలోనే ఉద్యోగ భవన్‌లో నిర్వహించేవారు. విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు లేదా జాయింట్ కలెక్టర్లు వచ్చి పాల్గొనేవారు. వారి జిల్లాల అంశాలు చర్చించేవారు. ఇప్పుడు అవేమీ లేవు.

లేఅవుట్లు ఎన్ని ఇస్తున్నారో..?

వుడా ఏర్పాటైన నాటి నుంచి 2018 చివరి వరకూ ఎన్ని లేఅవుట్లకు అనుమతులు ఇచ్చిందో వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయి. 2019 నుంచి ఒక్క లేఅవుట్ వివరం కూడా లేదు. ఎవరు ఎక్కడ లేఅవుట్లు వేస్తున్నారు?, వాటి విస్తీర్ణం ఎంత?, ఎన్ని ప్లాట్లు అనేది ఎవరికీ తెలియదు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండరు. సమాచార హక్కు చట్టం కింద ప్రశ్నించినా సరైన ... మిగతా 6వ పేజీలో

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

పెరుగుతున్న ఆశావహులు

- ఈనెల 30న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక
- ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల
- తనకే అవకాశం దక్కుతుందని విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ధీమా
- తాజాగా తెరపైకి మాజీ మంత్రులు అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు పేర్లు
- తన పేరు పరిశీలించాలని కోరుతున్న మాజీ ఎంపీ ఎంవీవీ
- మరోవైపు తనకు ఇవ్వాలంటూ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూ కృష్ణ పట్టు


బూడి ముత్యాలనాయుడు


కోలా గురువులు


ఎంవీవీ సత్యనారాయణ


గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీ టికెట్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ పదవికి, పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఖాళీ అయిన స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో వైసీపీలో పలువురు నేతలు సీటు కోసం ప్రయత్నాలు మొదలెట్టారు.

మూడున్నరేళ్ల క్రితం (2021 ఫిబ్రవరి) జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాడు అధికారంలో ఉన్న వైసీపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. దీంతో రెండున్నరేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవులు వైసీపీ దక్కించుకుంది. అందులో ఒక స్థానానికి నగరానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను, రెండో స్థానానికి వరుదు కళ్యాణిని ఎంపిక చేసింది. వంశీకృష్ణశ్రీనివాస్ గత ఏడాది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోవడంతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయ్యింది. ఆ స్థానానికి ఈనెల 30న ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో వైసీపీలో పలువురు పోటీ పడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని స్థానిక సంస్థల్లో వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఆశావహులు పెరుగుతున్నారు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న కోలా గురువులు ఎమ్మెల్యేగా పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పంపించాలని ఆ పార్టీ అధిష్ఠానం ... మిగతా 6వ పేజీలో

అసలేం జరిగింది?

మాజీ ఎంవీవీ కుటుంబ సభ్యుల నిర్బంధం, కిడ్నాప్ కేసు పునర్విచారణ

- ఆ కేసులో ప్రధాన నిందితుడైన హేమంత్‌ను సెంట్రల్ జైలులో విచారించిన ఓ పోలీస్ ఉన్నతాధికారి
- సుమారు గంటన్నరపాటు ప్రశ్నల వర్షం
- పలు విషయాలపై ఆరా తీసినట్టు ప్రచారం
- ఆ కేసులో వాస్తవాలను దాచిపెట్టారనే అనుమానాలు


కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు హేమంత్ (ఫైల్)

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజోతి): **విశాఖపట్నం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల నిర్బంధం, కిడ్నాప్ కేసును పునర్విచారణ చేయబోతున్నట్టు తెలిసింది.**

గత ఏడాది జూన్ 17వ తేదీన అప్పటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడితోపాటు ఆయన స్నేహితుడు, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావును రౌడీషీటర్లు నిర్బంధించిన విషయం తెలిసిందే. కిడ్నాప్ జరిగిన రెండు రోజులకు పోలీసులకు సమాచారం అందింది. అందుకు కారకులైన రౌడీషీటర్ హేమంత్‌తోపాటు అతడి స్నేహితుడు రాజేశ్, మరికొందరిని పోలీసులు వెంటాడి పద్మనాభం వద్ద పట్టుకున్నారు. డబ్బు కోసమే కిడ్నాప్ చేసినట్టు ప్రకటించి నిందితులను రిమాండ్‌కు తరలించారు. అయితే కిడ్నాప్ వెనుక అనేక వ్యవహారాలు ఉన్నాయనే ప్రచారం జరిగినా పోలీసులు పట్టించుకోలేదు. ఈ కేసులో ప్రధాన నిందితులైన హేమంత్‌తోపాటు రాజేష్ ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్నారు.

మాజీ ఎంపీ ఎంవీవీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో వాస్తవాలను నాడు పోలీసులు దాచిపెట్టినందున వాటిని వెలికితీయాలనే పట్టుదలతో ప్రస్తుతం కూటమి నాయకులు ఉన్నట్టు తెలిసింది. కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడైన హేమంత్ ద్వారా ఎంవీవీ అనేక సెటిల్‌మెంట్లు చేయించారని, అందుకు భారీగా డబ్బు ఇస్తానని ఆఫర్ చేసి, మాట తప్పడంతోనే ఆయన భార్య, కుమారుడితో పాటు స్నేహితుడిని కిడ్నాప్ చేశారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అందులో వాస్తవాలేమిటనేది నిగ్గుతేల్చాలని పోలీసులు నిర్ణయించినట్టు సమాచారం. అందులో భాగంగానే నగరానికి చెందిన ఒక పోలీస్ ఉన్నతాధికారి 15 రోజుల కిందట కేంద్ర కారాగారానికి వెళ్లి హేమంత్‌ను సుమారు గంటన్నరపాటు విచారించినట్టు తెలిసింది. ప్రధానంగా ఎంవీవీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేయడానికి గల కారణాలేమిటి, గతంలో ఎంవీవీతో ఉన్న సంబంధాలు గురించి పోలీస్ ఉన్నతాధికారి ప్రశ్నించినట్టు సమాచారం. ఈ సందర్భంగా హేమంత్ తనకున్న ఆస్తులు, వాటిని ఎలా సమకూర్చుకున్నదీ, ఎవరికి సహాయం చేస్తే, ప్రతిఫలంగా ఎవరెవరు ఆర్థికంగా సహాయం చేశారనే వివరాలను పోలీస్ ఉన్నతాధికారికి వివరించినట్టు తెలిసింది. మూడు నెలల కిందట కోర్టుకు హాజరైనప్పుడు కిడ్నాప్ కేసుకు సంబంధించిన పూర్వాపరాలను లిఖితపూర్వకంగా నగరంలోని ఒక కార్పొరేటర్‌కు అందజేశానని ఈ సందర్భంగా హేమంత్ చెప్పినట్టు సమాచారం. కిడ్నాప్ వెనుక అనేక ఆర్థిక వ్యవహారాలు, సెటిల్‌మెంట్లు, దందాలు నడిచినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చిన సదరు అధికారి...ఆ కేసుకు సంబంధించిన ఫైల్‌ను తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ బట్టి చూస్తే...మాజీ ఎంపీ ఎంవీవీ కుటుంబసభ్యులు, స్నేహితుడి కిడ్నాప్ కేసును తిరిగి ఓపెన్ చేసి దర్యాప్తు చేసే అవకాశం లేకపోలేదని అంటున్నారు.

జగన్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

- స్టాండింగ్ కమిటీ ఎన్నిక గురించి ప్రస్తావన
- అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజం
- కార్పొరేటర్ల రాజీనామాపై వైసీపీ అధినేత వ్యాఖ్యలు
- తాడేపల్లి టూర్‌కు ఎనిమిది మంది డుమ్మా
- వారు కూడా టీడీపీ, జనసేనల్లో చేరతారని ప్రచారం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్పొరేటర్లు గురువారం తాడేపల్లిలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఈనెల ఏడో తేదీన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగనున్న తరుణంలో జగన్‌ను కార్పొరేటర్లు కలవడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీలో ఇండిపెండెంట్ ... మిగతా 6వ పేజీలో


మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్లు

మూతపడిన డాక్‌యార్డు వంతెన

- వార్త I పేజీలో

- నిలిచిపోయిన వాహన రాకపోకలు
- కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు



మల్కాపురంలో భారీ చోరీ

- వార్త 6వ పేజీలో

- 45 తులాల బంగారం, లక్షన్నర నగదు అపహరణ

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం కూడదు

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సెబాస్టియన్ కాలనీలో గెడ్డను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

జ్ఞానాపురం, ఆగస్టు 1: చెత్త తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ హెచ్చరించారు. జ్ఞానాపురం, సెబాస్టియన్ కాలనీ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి ఆర్ అండ్‌డీ యార్డును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎళ్లుగా జ్ఞానాపురంకు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు వేణుగోపాలరావును ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రధాన వైద్యాధికారి నరేశ్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, కార్య నిర్వాహక ఇంజనీర్ మృత్యుంజయరాజు, ఏఎంవోహెచ్ డా.సునీల్ కుమార్, ఏపీపీ వెంకటరావు, రెవెన్యూ అధికారులు బాబూరావు, రాజ్యలక్ష్మి తదితరులున్నారు.

మల్కాపురం జనతా కాలనీలో భారీ చోరీ

» 48 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు అపహరణ
» ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ, ఏసీపీ, సీఐలు, ఎస్‌ఐలు
» ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్





దొంగలు ప్రవేశించిన మార్గం చూస్తున్న పోలీసులు, బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమణ

మల్కాపురం, ఆగస్టు 1: మల్కాపురం శివారు జనతాకాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత భారీ చోరీ జరిగింది. సుమారు 48 తులాల బంగారు ఆభరణాలు, రూ1.5 లక్షల నగదును దొంగలు అపహరించారు. వివరాలివి.. జనతాకాలనీ మెయిన్‌రోడ్డులో రమేష్ నాయుడు సాగర్ పబ్లిక్ స్కూల్‌ను నడుపుతూ పాఠశాల సమీపంలోని ఓ భవనం మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. తొలి అంతస్థులో ఏసీ పనిచేయకపోవడంతో.. నెలరోజులుగా రెండో అంతస్థులోని గదిలో కుటుంబసభ్యులంతా నిద్రపోతున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పదిగంటల సమయంలో అంతా నిద్రలోకి జారిపోయారు. ఉదయం ఐదు గంటల సమయంలో కిందకు దిగి వచ్చి, తాళం తెరిచి ఇంట్లోకి వెళ్లేందుకు తలుపుతీస్తుండగా గడియ ఊడిపోయి కనిపించింది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉండడం, మంచమీద వస్తువులన్నీ చిందరవందరంగా కనిపించడంతో దొంగతనం జరిగిందని గుర్తించారు. వెంటనే మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంట్లోకి దొంగలు ఎలా ప్రవేశించి ఉంటారనే దానిపై ఆరా తీశారు. తాళాలు తీయకుండానే చోరీ జరగడంపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. ఇంటికి ముందు భాగంలో ఉన్న రంధ్రంలోంచి బాల్కనీలోకి దొంగలు ప్రవేశించి ఉంటారని అనుమానిస్తున్నారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తీసుకొచ్చిన జాగిలాలు బాల్కనీపైకి వెళ్లి, ఆ తరువాత ఇంట్లో బీరువాను తాకాయి. అక్కడి నుంచి పక్కగదిలోకి వెళ్లి.. రెండో అంతస్తు మెట్లు ఎక్కి.. దగ్గరలో ఉన్న చర్చి వరకు వెళ్లి ఆగాయి. ఘటనా స్థలానికి క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, లాఅండ్ ఆర్డర్ సీఐ విద్యసాగర్, క్రైమ్ ఎస్‌ఐలు ఎంవీ రమణ, న్యూపోర్టు ఎస్‌ఐ అప్పలరాజు చేరకుని దర్యాప్తు ప్రారంభించారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

జగదాంబ కూడలి, ఆగస్టు 1: వన్‌టౌన్ బురుజుపేట శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం ఆలయంలో నిత్య సేవలతో పాటు త్రికాల పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి దర్శనం కల్పించారు.

'నిరుద్యోగ యువతకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, ఆగస్టు 1: ప్రజా సమస్యలపై పోరాడుతున్న నిరుద్యోగ యువతకు చట్టసభల్లో ఎమ్మెల్సీ అవకాశం కల్పించి, ప్రోత్సాహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కూటమి నాయకులను కోరారు. ఎన్నికల ముందు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వందలాది ఉద్యమాలు చేసి పోలీసు కేసులను భరిస్తూ చివరిగా నిరుద్యోగ ఓదార్పు యాత్ర పేరుతో రాష్ట్రమంతా పర్యటించి వైసీపీ ప్రభుత్వ లోపాలను ప్రశ్నించామన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే

విశాఖపట్నం, ఆగస్టు 1: కేకే లైనులోని కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551), విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనెల ఒకటి నుంచి ఏడు వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ పాసింజర్ (08552), కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈనెల రెండు నుంచి ఎనిమిది వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖ నడుస్తాయన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను రద్దు చేశామన్నారు.

టాస్ సేవలకు అభినందన

కంచరపాలెం: టాస్ స్వచ్ఛంద సంస్థ సేవలను సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాస్ అభినందించారు. ఈ మేరకు టాస్ ప్రతినిధులు హరినారాయణ, లక్ష్మి, ప్రకాశ్‌ను గురువారం సత్కరించి, మెమెంటోలను అందజేశారు. గిరి ప్రదక్షిణ రోజు టాస్ సంస్థ ఆధ్వర్యంలో కైలాసపురం సీఐఎస్‌ఎఫ్ క్వార్టర్స్ వద్ద భక్తుల పాదాలకు నొప్పుల నుంచి ఉపశమనం కల్పించేలా ఆయింట్‌మెంట్స్‌తో మర్దన చేయడం, మందుల పంపిణీ తదితర కార్యక్రమాలను చేశారు.

కేజీహెచ్‌లో తల్లి పాల బ్యాంకు

మహారాణిపేట, ఆగస్టు 1: కేజీహెచ్‌లో త్వరలో తల్లి పాల బ్యాంకును ఏర్పాటు చేయనున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. పిల్లల విభాగంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాలు ఇచ్చేందుకు వీలుగా గైనిక్ పిడియాట్రిక్ వార్డులలో గదులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా అతిథులు బిడ్డకు తల్లిపాల విశిష్టతను వివరించారు. సమావేశంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

'శివాజీ సేవలు అభినందనీయం'

డాబాగార్డెన్స్, ఆగస్టు 1: సమాజాభివృద్ధికి బుద్ధ శివాజీ అందిస్తున్న సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. డాబాగార్డెన్స్‌లో ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజా సేవకు శివాజీ జీవితం అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో పూసర్ల విశ్వేశ్వరరావు, పాపారావు, మౌర్య, ఆళ్ల గోకుల మురళి, పీలా, తిలక్, నరసింహారావు, ఆడారి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

జ్ఞానాపురం, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం పండగలా సాగింది. జోన్ 5 పరిధిలో జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సచివాయల కార్యదర్శులు ఉదయం 10 గంటలకే 90 శాతం పంపిణీని పూర్తిచేశారు. జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ లబ్ధిదారునికి పింఛను అందించారు. జడ్సీ ఆర్‌జీవీ కృష్ణ, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కబ్ బుల్ బుల్ ఉత్సవం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

మర్రిపాలెం, ఆగస్టు 1: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కబ్ బుల్ బుల్ ఉత్సవాలు 104 ఏరియా శ్రీవిజయనగర్ కాలనీ కేంద్రీయ విద్యాలయం-2 లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ మాజీ ప్రిన్సిపాల్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ డాక్టర్ విజయ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి, క్రమశిక్షణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి చేస్తోందన్నారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో 12 కేంద్రీయ విద్యాలయాల నుంచి 180 మంది విద్యార్థులు, 20 మంది శిక్షణ నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా క్రమశిక్షణ, సమాజం, దేశంపట్ల బాధ్యత, నిరంతర జాగరూకత, దేశభక్తిని పెంపొందించడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీ-1, 2 ప్రిన్సిపాల్స్ మదీనామాలిక్, సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జగదాంబ కూడలి, ఆగస్టు 1: కేరళ వయనాడ్ తుఫాన్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జగదాంబ జంక్షన్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారని, మరింతమంది నిరాశ్రయులయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధితులకు సహాయం అందించడంలో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకొనేందుకు సీపీఎం పొలిట్ బ్యూరో పిలుపు మేరకు విరాళాలను సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బి.గంగారాం, కుమార్, రాజు, సుబ్బారావు, చంద్రమౌళి, నరసింగరావు, అప్పారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



తిలక్‌కు నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఆగస్టు 1: సమాజంలో మార్పునకు పేదరికం, భూస్వామ్యం, నియంతృత్వ పోకడలపై తన కలం ద్వారా చైతన్యం రగిల్చిన దేవరకొండ బాలగంగాధర తిలక్ చిరస్మరణీయ సాహితీవేత్త అని ఏయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో తిలక్ 103వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఇలాంటి సాహితీ గోస్టులు సమాజానికి అవసరమన్నారు. అధ్యాపకులు డాక్టర్ డి.ప్రవీణ మాట్లాడుతూ తిలక్ కథలు, కవిత్వంలో సమాజంలోని ప్రతి అంశాన్నీ స్పృశించారన్నారు. జి.యోహన్‌బాబు, అధ్యాపకులు నేమాని శారద తిలక్ రచనా విలువలు గుర్తుంచుకోవాలన్నారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీవీ సూర్యారావు, వెలమల సిమ్మన్న, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో అంతా గుట్టు!

... 5వ పేజీ తరువాయి

జవాబు ఇవ్వరు. 2018 వరకు అన్ని వివరాలు వెల్లడించిన వారికి ఇప్పుడు ఏమిటి సమస్య ఏమిటో చెప్పరు.

ఇంజనీరింగ్ విభాగం కూడా ఎక్కడెక్కడ ఏయే ప్రాజెక్టులు నిర్మిస్తున్నది?, వాటికి అయిన వ్యయం ఎంత?...వంటి వివరాలు కూడా పెట్టేది. ఇప్పుడు వెబ్‌సైట్ చూస్తే పాత వివరాలు తప్పితే కొత్తవి అందులో ఏమీ లేవు. ఆ వెబ్‌సైట్ చూసినవారికి ఇది వందల కోట్ల రూపాయల టర్నోవర్ చేసే సంస్థేనా?...అని అనుమానం కలుగుతుంది. వీఎంఆర్‌డీఏకు అద్దెలు, ప్లాట్ల వేలం ద్వారా ఆదాయం వస్తుంది. ఎక్కడ దుకాణాలు ఖాళీ ఉన్నాయో డిస్‌ప్లే చేస్తే కావలసిన వారు దరఖాస్తు చేసుకుంటారు. అది కూడా రహస్యమే. ఇక విక్రయానికి భూములు ఎక్కడున్నాయో తెలిస్తే కొనాలనుకునేవారు దరఖాస్తు చేసుకుంటారు. ఆ అవకాశం కూడా వెబ్‌సైట్‌లో లేదు. అసలు దానిని జనరంజకంగా తీర్చిదిద్దాలనే ఆలోచన అక్కడ అధికారులకు ఎవరికీ లేదు. వీఎంఆర్‌డీఏకు ప్రత్యేకంగా ఐటీ విభాగం ఉంది. పరిపాలనా వ్యవహారాలు చూడడానికి సెక్రటరీ ఉన్నారు. కానీ ఎవరికీ ఏమీ పట్టదు. కొత్త కమిషనర్ హయాంలోనైనా ఈ ప్రాంత అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ బోర్డు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నదో తెలియజేసే ఏర్పాటు చేస్తారని ఆశిద్దాం.

సెంట్రల్ డ్రగ్ ఫార్మసీ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు

... 5వ పేజీ తరువాయి

మానేశారు. విధుల్లో చేరినప్పుడు ఇచ్చిన సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే, యాజమాన్య ప్రతినిధులు విచిత్రమైన నిబంధనలు పెట్టారు. ఇప్పటివరకూ తాము ఇచ్చిన వేతనం వెనక్కి ఇవ్వాలని, అలాగే హాస్టల్ వసతికి, భోజనానికి డబ్బులు చెల్లించాలని...అప్పుడు సర్టిఫికెట్లు ఇస్తామని మొండికేశారు. ఎంత బతిమాలినా ఇవ్వకపోవడంతో బాధితులంతా దుకాణం ముందు ధర్నా చేపట్టారు. అయినా వారు స్పందించలేదు. దాంతో నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆ ఫిర్యాదును సంబంధిత శాఖ డ్రగ్ కంట్రోల్ అథారిటీకి పంపించారు. వారు విచారించి, అతి తక్కువ మంది పనిచేస్తున్నట్టు లైసెన్స్ తీసుకున్నారని, కానీ అంతకు పదింతల సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తున్నారని, తన పరిధికి మించి ఉండడంతో మరో ఉన్నతాధికారికి విచారణ బాధ్యత అప్పగించాలని కోరారు. ఆ మేరకు జిల్లా అధికారులు అడిషనల్ డ్రగ్ కంట్రోలర్ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనేక అవకతవకలు బయటపెట్టారు. వాటిపై వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దానికి ఆ యాజమాన్యం స్పందించలేదు. ఈ విషయం కలెక్టర్ హరీంధిర ప్రసాద్‌కు తెలియజేశారు. తక్షణమే వారి లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని, షాపును సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదు చేసిన యువతులకు సర్టిఫికెట్లను వెనక్కి ఇప్పించాలని ఆదేశించారు. ఆ మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు గురువారం సెంట్రల్ డ్రగ్ ఫార్మసీని మూసివేయించారు. మిగిలిన విషయాలపై తదుపరి విచారణ నిర్వహిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు వారం రోజుల పాటు లైసెన్స్ రద్దు చేశారు. ఏ యాజమాన్యమైనా ఉద్యోగులను వేధిస్తే ఫలితం ఇలాగే ఉంటుందని, ఉపేక్షించేదని అధికార వర్గాలు తెలిపాయి.

జగన్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్‌తో కలుపుకుని వైసీపీకి 60 మంది కార్పొరేటర్లు ఉండేవారు. వారిలో 12 మంది ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. మిగిలిన 48 మందిలో 40 మంది కార్పొరేటర్లు రెండు బస్సుల్లో బయలుదేరి తాడేపల్లి వెళ్లారు.

మాజీ సీఎం జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నిక విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. ఎన్నికలో గెలుపొందాలంటే 49 మంది కార్పొరేటర్ల బలం అవసరమని, అంత బలం లేకపోయినప్పటికీ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పోటీకి దిగుతున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావులు వివరించారు. పలువురు కార్పొరేటర్లు పార్టీని వదిలి వెళ్లిపోయిన విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి జగన్ స్పందిస్తూ అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజమని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయడం సాధ్యం కాదని, ఈ ఐదేళ్లు ప్రజల్లోనే ఉండాలని కార్పొరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వారిలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు. ఇదిలావుండగా జగన్‌ను కలిసేందుకు వెళ్లని ఎనిమిది మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరడం ఖాయమంటున్నారు. అదే జరిగితే జీవీఎంసీలో వైసీపీ బలం 40కి పడిపోనున్నది.

విశాఖ క్రికెట్ జట్టుకు వీడీసీఏ అభినందనలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 1: రాష్ట్ర స్థాయి అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న విశాఖ క్రికెట్ జట్టు ఆటగాళ్లతో పాటు కోచ్, మేనేజర్, సహాయ సిబ్బందిని జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) అభినందించింది. ఫైనల్స్‌లో కృష్ణా జట్టును 433 పరుగుల భారీ తేడాతో చిత్తు చేయడంపై హర్షం వ్యక్తం చేసింది. బ్యాటింగ్‌లో సెంచరీలు, అర్థ సెంచరీతో రాణించిన వీసీహెచ్.శ్రావణ్ (113), రోహన్ గణపతి (151 నాటౌట్), ఈశ్వర్ వర్ధన్ (87)తో పాటు బౌలింగ్‌లో ప్రతిభ చూపిన కె.భాను శ్రీహర్ష (ఆరు వికెట్లు), గౌతమ్ ఆర్య (నాలుగు వికెట్లు)లను గురువారం ఏసీఏ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు పార్థసారధి, జేకేఎం.రాజు తదితరులు అభినందించారు.

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

... 5వ పేజీ తరువాయి

మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వ్యవసాయ భూమి 0.48 చ.కి.లు, పచ్చదనం 1.24 చ.కి, పరిశ్రమలు 5.94, నగరం 14.2, వృథా భూములు 2.6, నీటి వనరుల ప్రాంతం 7.96 చదరపు కిలోమీటర్ల వైశాల్యం మేర నీట మునగనున్నది. దీంతో విశాఖ పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేటల్లో సముద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయని ఈ సంస్థ అంచనా వేసింది.

పోర్టు నుంచి మంగమారిపేట వరకూ తీర ప్రాంతం ఇప్పటికే చాలావరకు కోతకు గురై నీట మునిగింది. ఏటా విశాఖ తీరంలో సముద్రం ముందుకువస్తోంది. కోస్టల్ బ్యాటరీ, సబ్‌మెరైన్, వైఎంసీఏ ఎదురుగా సముద్ర తీరం కోతకు గురవుతుంది. ఆర్కే బీచ్‌లో స్కాండిల్ పాయింట్‌కు ఒకప్పుడు సముద్రం చాలా దూరంగా ఉండేదని, ఇప్పుడు రుతుపవన సీజన్‌లో నీరు తాకుతోందని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మానవ అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావంతో పెరిగిన భూతాపం వల్ల సముద్ర మట్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకు ఆసియా దేశాలు మినహాయింపు కాదని ఐపీసీసీ ఇప్పటికే స్పష్టంచేసింది. సముద్ర మట్టాలు పెరగడంతో ముంబై తరువాత ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే నగరం విశాఖేనని తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. సముద్ర మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు పక్కనున్న మేహాద్రిగెడ్డలోకి నీరు ప్రవేశిస్తే ఆ ప్రాంతంలో చెట్లు, మడ అడవులు ముంపునకు గురవుతాయి. ఇంకా సముద్ర నీరు మేహాద్రిగెడ్డ లోపలకు ప్రవేశిస్తే భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారతాయి. బీచ్‌రోడ్డు ఇప్పటికే కోతకు గురవుతూనే ఉంది. సముద్ర మట్టాలు పెరిగే క్రమంలో పడనున్నది. ఈ పరిణామం జీవ వైవిధ్యం, పర్యాటక, ఉపాధి రంగాలపై ప్రభావం చూపుతుంది. ఈ సంస్థ చేపట్టిన అధ్యయనం మేరకు 2060కల్లా విశాఖ తీరంలో 1.95 శాతం (13.29 చ.కి.మీ), 2080కల్లా 2.67 శాతం (18.18 చదరపు కిలోమీటర్లు), 2100కల్లా 4.76 శాతం (32.44 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) భూమి నీట మునుగుతుందని అంచనా వేసింది.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

... 5వ పేజీ తరువాయి

భావించినా క్రాస్ ఓటింగ్ కారణంగా ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని పార్టీకి విధేయుడిగా ఉన్న గురువులుకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు మారిపోయాయి. వచ్చే ఐదేళ్లపాటు పార్టీ తరఫున పోరాటం చేయాలంటే తమకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు బూడి ముత్యాలనాయుడు అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టిన తనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పార్టీ నేతల వద్ద వాపోయినట్టు తెలిసింది. వీటని తట్టుకుని నిలబడాలంటే తనకు చట్టబద్ధమైన పదవి ఉండాలని అధిష్ఠానానికి విన్నవించినట్టు సమాచారం. ఐదేళ్లపాటు నిలదొక్కుకోవడానికి మాత్రమే ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ కూడా ఎమ్మెల్సీగా తనకు అవకాశం ఇవ్వాలని, పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తాను భారీగా ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ నేతలందరి అభిప్రాయ సేకరణ జరిపి పార్టీ అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తానని సుబ్బారెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. జగన్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని తనను కలిసిన ఆశావహులకు సుబ్బారెడ్డి చెబుతున్నారు.



కొండయ్యవలసలో శాకంబరిగా దర్శనమిచ్చిన మరిడిమాంబ

శాకంబరిగా మరిడిమాంబ

అగనంపూడి, ఆగస్టు 1: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని మరిడిమాంబ ఆలయంలో ఆషాఢ గురువారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మరిడిమాంబను దర్శించుకున్నారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బుదిరెడ్డి అప్పారావు, బి.శ్రీను, బి.సత్యనారాయణ, శేఖర్, చందు, పట్టా పైడిరత్నం, కన్నారావు, రామకృష్ణ, వి.రామతులసి, లక్ష్మి, రమణమ్మ, సేవా సమితి ఆర్గనైజర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కును సందర్శించిన గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 1: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా కాలనీలో ఉన్న చిల్డ్రన్, వాకర్స్ పార్కును గురువారం ఉదయం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఇక్కడి పార్కులో ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు, యోగా ఇతర కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేయగా, అందుకు గణబాబు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు, నాయకులు పి.బలభద్ర రాజు, సూర్యనారాయణ, వైటీఆర్, వీటీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లిపాలే శ్రేష్ఠం

పెదగంట్యాడ, ఆగస్టు 1: బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలివ్వడం ఎంతో శ్రేష్ఠమని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పైడి హేమలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం జాలరిపల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన తల్లీబిడ్డలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పల్లిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త శీరం దుర్గమ్మ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమే కాకుండా మంచి రోగ నిరోధక శక్తిని ఇస్తాయన్నారు. ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, అంగన్‌వాడీ కార్యకర్త వేణుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 1: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రధాన జంక్షన్ల వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఉక్కు టౌన్‌షిప్‌లో పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వీటి కనెక్షన్‌ను స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా పోలీసులు తక్షణమే అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించేందుకు అవకాశం ఏర్పడింది.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి:** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 62, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 74, పొటల్స్ 34, కీరదోస 28, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

చకచకా సాగుతున్న పార్కు నిర్మాణ పనులు

- హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.ఆరు కోట్ల వ్యయంతో ఏర్పాటు
- అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా వసతులు కల్పిస్తున్న అధికారులు





హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న అధునాతన పార్కు (ఇన్‌సెట్లో) రూపుదిద్దుకుంటున్న క్రీడా కోర్టు

గాజువాక, ఆగస్టు 1: గాజువాక హౌసింగ్ బోర్డు కాలనీలో సుమారు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న అత్యాధునికమైన పార్కు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సువిశాలమైన స్థలంలో చిన్నారులు, పెద్దలు, వృద్ధులకు ఆహ్లాదాన్ని కలిగించేలా దీనిని నిర్మిస్తున్నారు. పలు రకాల క్రీడలకు సంబంధించిన కోర్టుల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. పార్కుకు ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా ముఖద్వారం వద్ద వాటర్ ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేయనున్నారు. క్రికెట్, విండ్ బాల్, బాస్కెట్‌బాల్, తదితర క్రీడలకు సంబంధించి కోర్టులను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. పచ్చదనంతో కనువిందు చేసేలా పార్కు మొత్తం గార్డెనింగ్‌తో పాటు ఆకర్షనీయమైన పూల మొక్కలను ఏర్పాటు చేయనున్నారు. ఉన్నత స్థాయి ప్రమణాలతో అత్యాధునికంగా ఈ పార్కును నిర్మించాలని జీవీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా నిర్మితమవుతున్న ఈ పార్కు మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

దువ్వాడ పోలీసులకు సూచించిన డీసీపీ తుహిన్ సిన్హా



దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో తుహిన్ సిన్హా

కూర్మన్నపాలెం, ఆగస్టు 1: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీసీపీ-2 తుహిన్ సిన్హా సూచించారు. గురువారం ఆయన దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫైళ్లను పరిశీలించడంతో పాటు కేసుల వివరాలను సీఐ ఎర్రంనాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులకు స్టేషన్‌లో అందిస్తున్న సేవలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పోలీసులంతా అవిశ్రాంతంగా ప్రజా సేవలో ఉంటూ ఇష్టంతో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఆ తర్వాత దువ్వాడ రైల్వే స్టేషన్, మంగళపాలెం, దువ్వాడ, రాజీవ్ నగర్, వుడా నగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలను ఆయన సందర్శించి ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకునేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై నిరంతరం ప్రజలకు అవగాహన కల్పించాలని డీసీపీ సూచించారు.

అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 1: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసేందుకు అఖిలపక్ష రాజకీయ పార్టీలతో సమావేశాన్ని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహించి ప్రధాన మంత్రి మోదీపై ఒత్తిడి తేవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,267వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును చంద్రబాబు గాడిలో పెట్టగలరని తామంతా విశ్వసిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించాలన్నారు. తొలుత కార్మిక నేత దివంగత వీవీ రామారావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. కార్మిక హక్కుల సాధన కోసం రామారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, మసేనురావు, రాజబాబు, నరసింహరావు, కనకరాజు, ఎన్.రామారావు, శ్రీనివాసనాయుడు, వేంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి అలివేలు మంగాదేవి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు



పెందుర్తి, ఆగస్టు 1: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషివాడ సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో ఈ నెల ఐదో తేదీ నుంచి సెప్టెంబరు రెండో తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అలివేలు మంగాదేవికి లక్ష్మీసహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ గురువారాలు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, శ్రావణ శుక్రవారాలు లక్ష్మీ, విష్ణుసహస్రనామ అర్చనలు, సామూహిక కుంకుమార్చన, తదితర పూజాది కార్యక్రమాలను చేపడతారు. కాగా 19న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అలివేలు మంగాదేవికి 108 కలశాలతో పసుపు పూజలు 27న శ్రావణ ద్వాదశిని పురస్కరించుకుని దీపారాధన నిర్వహిస్తారు.

13 నుంచి బ్రహ్మోత్సవాలు

ఇదిలావుండగా ఈ నెల 13 నుంచి అలివేలు మంగాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13న విష్వేశ్వర, శ్రీలక్ష్మీ పూజ, సహస్ర దీపారాధనతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. 14న అలివేలు మంగాదేవి శ్రీనివాసుని కల్యాణం, 15న బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా హోమాలు పూర్ణాహుతి చేపడతారు. సెప్టెంబరు ఒకటిన ఆలయం వద్ద అన్న సమారాధనను నిర్వహిస్తారు. రెండో తేదీతో శ్రావణ మాసోత్సవాలను ముగిస్తారు. ఆయా పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల దళిత కాలనీల్లో సంబరాలు



తుంగ్లాంలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం తీర్పునివ్వడంతో 68, 69 వార్డుల్లోని ఎస్సీ కాలనీల్లో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. తుంగ్లాం ఎస్సీ కాలనీలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు పెట్ల వెంకటరమణ ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలంతా ఐక్యంగా చేపట్టిన ఉద్యమాలకు ఇప్పుడు తగిన ఫలితం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా అమలు చేసి యువతకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈతలపాక మంగరాజు, పెట్ల అర్జున్, సీహెచ్ సూర్యనారాయణ, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వంగలపూడి గోపి, పి.అప్పారావు, ఎ.రాజు, జి.రామాంజనేయులు, యు.ప్రవీణ్, తదితరులు ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

మల్కాపురం: ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘంగా చేస్తున్న పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు దళిత వర్గాలను కాపాడుతుందని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇక్కడి రామ్-రాంజీ సంక్షేమ సంఘం వద్ద మాదిగలు, మాదిగ ఉపకులాలు, రెల్లిలు, రెల్లి ఉపకులాల వారు కేక్ కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎస్సీ కాలనీల్లో డప్పులు వాయిస్తూ ఆనందంగా తిరిగారు. అలాగే ములగాడ పరిసర ప్రాంతాల్లో కూడా దళిత నాయకులు సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మిందిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



బీరువాలోని వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన గురువారం మింది కాలనీలో చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మింది కాలనీలో నివాసం ఉంటున్న ఈటి వెంకటరావు, భాగ్యలక్ష్మి దంపతులు ఈ నెల 27న విజయవాడలో ఉంటున్న తమ రెండో కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి పనిమనిషి ఇంటి బయట శుభ్రపరిచేందుకు రాగా మెయిన్ డోర్ గ్రిల్స్‌కు తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గుర్తించి మధురవాడలో ఉంటున్న వెంకటరావు కుమార్తెకు, స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సౌత్ ఏసీపీ శ్యామలరావుతో పాటు సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని బీరువా తెరిచి ఉండడంతో పాటు గదిలోని సామగ్రి చెల్లాచెదురుగా పడివుండడాన్ని గుర్తించారు. సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, పలు వెండి వస్తువులు, కొన్ని యూఎస్ డాలర్లు పోయినట్టు వెంకటరావు కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ తల్లి దండ్రులకు చోరీ గురించి చెప్పానని, వారు వచ్చాక చోరీకి గురైన పూర్తి వస్తువుల వివరాలు తెలుస్తాయని ఆమె పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ జిమ్ పనులు పరిశీలన

పెందుర్తి-రూరల్, ఆగస్టు 1: గ్రేటర్ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.పదిన్నర లక్షలతో చేపట్టిన ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్పొరేటర్ వెంట దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు కె.చందూ యాదవ్, కాలనీ సంఘం ప్రతినిధులు రమణమూర్తి, వై.సత్యనారాయణ, కేశవరావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా పింఛన్‌ను ఆపేశారు..

- పునరుద్ధరించాలంటూ ఓ వృద్ధుని వేడుకోలు



లంకా రామచంద్రరావు

గాజువాక, ఆగస్టు 1: గత వైసీసీ ప్రభుత్వ హయాంలో అర్ధంతరంగా తన పింఛన్‌ను నిలిపివేశారని, దీనిని పునరు ద్ధరించవలసిందిగా ఓ వృద్ధ బ్రాహ్మణుడు అధికారులను కోరుతున్నారు. గాజువాకలోని శ్రీనగర్‌కు చెందిన తనకు 2020 జూలై నుంచి 2022 డిసెంబరు వరకు నెలకు రూ. 2,250 చొప్పున సామాజిక పింఛన్ అందేదని, అయితే ఆ తర్వాత నుంచి పెన్షన్‌ను నిలిపివేశారని లంకా రామచంద్రరావు(84) ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ ఆగిపోవడంపై సచివాలయానికి వెళ్లి సిబ్బందిని అడిగితే పెన్షన్ రద్దయిందని చెబు తున్నారే తప్పా పునరుద్ధరణ విషయంపై లేనిపోని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా పింఛన్‌ను పునరుద్ధరిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారని వాపోయారు. తన భార్య మృతి చెం దిందని, పిల్లలు పట్టించుకోకపోవడంతో పౌరోహిత్యం చేస్తూ వచ్చిన డబ్బులతో పాటు బీహెచ్‌పీవీ రిటైర్డు ఉద్యోగిగా నెలకు వచ్చే తక్కువ పింఛన్ రూ.వెయ్యితో కాలం వెళ్లదీస్తున్నానని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌లకు పోస్టల్ ద్వారా వినతిపత్రాలు పంపానని రామచంద్రరావు తెలిపారు.

గాజువాక జోన్‌లో 97 శాతం పింఛన్లు పంపిణీ

గాజువాక, ఆగస్టు 1: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో గురువారం 97 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం ఐదు గంటల నుంచే సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేశారు. జోన్ పరిధిలో 32,028 మంది పెన్షన్‌దారులు ఉండగా 31,126 మందికి సుమారు రూ.13,43,05,500 నగదును అందజేశారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జెడ్సీ సన్యాసినాయుడు పర్యవేక్షించారు. నిర్ణీత సమయానికి పింఛన్లను పంపిణీ చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కొండవాలు ప్రాంతాల్లోని శిథిల ఇళ్లను గుర్తించండి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 1 : అధిక వర్షాల నేపథ్యంలో నగరంలో ఉన్న కొండవాలు ప్రాంతాల్లో శిథిల ఇళ్లను గుర్తించి, ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తం చేయాలని జీవీ ఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువా రం ఆయన తన కార్యాలయంలో ఇంజ నీరింగ్, పట్టణ ప్రణాళిక, యూసీడీ అధికారులు, జోనల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించేందుకు ప్లానింగ్ అధికారులు, ఎమినిటీస్ కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సర్వే నిర్వహించాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తం చేయాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు ఆశ్రయం కల్పించేందుకు ముందస్తుగా రిహాబిలిటేషన్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో సర్వే చేసి, అక్కడ శాశ్వత ప్రాతిపదికన అవసరమయ్యే రక్షణ గోడలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు వారి ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు సూచిస్తున్న ప్రతిపాదనలకు అనుగుణంగా అధికారులు సర్వే నిర్వహించుకోవాలని చెప్పారు. ప్రజల కు అందించే సేవల్లో ఎటువంటి లోటుపాటులు లేకుండా సచివాలయాలు, కార్యదర్శుల పనితీరుపై పర్యవేక్షణ చేయాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. సమావేశంలో పీడీ యూసీ డీ ఫణిరామ్, జెడ్సీలు కె.కనక మహాలక్ష్మి, జె.విజయలక్ష్మి, ఆర్‌జీవీ కృష్ణ, బి.సన్యాసినాయుడు, హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు సాంసన్ రాజు, రామ్మోహన్‌రావు, వేణుగోపాల్, గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఏపీడీలు పాల్గొన్నారు.

93వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన



ప్రహ్లాదపురంలో ప్రజలతో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, ఆగస్టు 1: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కార్పొరేటర్ రాపర్తి కన్నా పర్యటించారు. ముఖ్యంగా త్వరలో ఏర్పాటు చేయనున్న పీహెచ్‌సీకి కావాల్సిన స్థలం గురించి పరిశీలించారు. శ్రీనివాసనగర్ కాలనీవాసులు తమ ప్రాంతంలో సంత. సామాజిక భవనం ఏర్పాటు, ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా, అందుకు తగిన చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరహాలు, పైడిరాజు, శోభ, జనసేన నాయకులు జగన్మోహన్, నాగరాజు, దేముడు, తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 1: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయూ కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజులు పేర్కొన్నారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోలో గురువారం విశాఖ రీజనల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కార్మికులంతా సమయపాలన పాటిస్తూ సంస్థ అభివృద్ధికి దోహదపడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు పీపీఎం రాజు, బి.నీలకంఠం, రీజనల్ అధ్యక్షుడు గండి రామకృష్ణతో పాటు జిల్లాలోని అన్ని డిపోలకు చెందిన నుండి అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, ఆగస్టు 1: పద్మనాభపురం సబ్ స్టేషన్ పరిధి బంటా కాలనీలో కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు, నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బంటా కాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనర్సయ్య కాలనీ, వెంకటసాయినగర్, రవినగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ రాంపురం ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాపూజీ నగర్, సాధూ మఠం, సాయిరాం లేఅవుట్, హర్షవర్ధన్ నగర్, లయోలా ఐటీఐ, మోర్ గోడౌన్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్ పరిధి హరిజన జగ్గయ్యపాలెం ఫీడర్‌కు మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎస్టీబీఎల్, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియా, గేట్ వే, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మల్కాపురం: జనతా కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా జనతా కాలనీ, వెంకన్నపాలెం, ఇండస్ట్రియల్ కాలనీ, రామకృష్ణపురం, సెయింట్ ఆన్స్ కాలేజీ, స్కూల్, హెచ్‌పీసీఎల్, ఎంఎంటీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం కూడదు

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సెబాస్టియన్ కాలనీలో గెడ్డను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

జ్ఞానాపురం, ఆగస్టు 1: చెత్త తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ హెచ్చరించారు. జ్ఞానాపురం, సెబాస్టియన్ కాలనీ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి ఆర్ అండ్‌డీ యార్డును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎళ్లుగా జ్ఞానాపురంకు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు వేణుగోపాలరావును ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రధాన వైద్యాధికారి నరేశ్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, కార్య నిర్వాహక ఇంజనీర్ మృత్యురాజు, ఏఎంవోహెచ్ డా.సునీల్ కుమార్, ఏపీపీ వెంకటరావు, రెవెన్యూ అధికారులు బాబూరావు, రాజ్యలక్ష్మి తదితరులున్నారు.

మల్కాపురం జనతా కాలనీలో భారీ చోరీ

» 48 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు అపహరణ
» ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ, ఏసీపీ, సీఐలు, ఎస్ఐలు
» ఆధారాలు సేకరించిన క్లూస్‌టీమ్



దొంగలు ప్రవేశించిన మార్గం చూస్తున్న పోలీసులు, బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ రమణ

మల్కాపురం, ఆగస్టు 1: మల్కాపురం శివారు జనతాకాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత భారీ చోరీ జరిగింది. సుమారు 48 తులాల బంగారు ఆభరణాలు, రూ1.5 లక్షల నగదును దొంగలు అపహరించారు. వివరాలివి.. జనతాకాలనీ మెయిన్‌రోడ్డులో రమేష్ నాయుడు సాగర్ పబ్లిక్ స్కూల్‌ను నడుపుతూ పాఠశాల సమీపంలోని ఓ భవనం మొదటి అంతస్థులో నివాసం ఉంటున్నాడు. తొలి అంతస్థులో ఏసీ పనిచేయకపోవడంతో.. నెలరోజులుగా రెండో అంతస్థులోని గదిలో కుటుంబసభ్యులంతా నిద్రపోతున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పదిగంటల సమయంలో అంతా నిద్రలోకి జారీపోయారు. ఉదయం ఐదు గంటల సమయంలో కిందకు దిగి వచ్చి, తాళం తెరిచి ఇంట్లోకి వెళ్లేందుకు తలుపుతీస్తుండగా గడియ ఊడిపోయి కనిపించింది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉండడం, మంచమీద వస్తువులన్నీ చిందరవందరంగా కనిపించడంతో దొంగతనం జరిగిందని గుర్తించారు. వెంటనే మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంట్లోకి దొంగలు ఎలా ప్రవేశించి ఉంటారనే దానిపై ఆరా తీశారు. తాళాలు తీయకుండానే చోరీ జరిగడంపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. ఇంటికి ముందు భాగంలో ఉన్న రంధ్రంలోంచి బాల్కనీలోకి దొంగలు ప్రవేశించి ఉంటారని అనుమానిస్తున్నారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తీసుకొచ్చిన జాగిలాలు బాల్కనీపైకి వెళ్లి, ఆ తరువాత ఇంట్లో బీరువాను తాకాయి. అక్కడి నుంచి పక్కగదిలోకి వెళ్లి.. రెండో అంతస్థు మెట్లు ఎక్కి.. దగ్గరలో ఉన్న చర్చి వరకు వెళ్లి ఆగాయి. ఘటనా స్థలానికి క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, లాఅండ్ ఆర్డర్ సీఐ విద్యసాగర్, క్రైమ్ ఎస్ఐలు ఎంవీ రమణ, న్యూపోర్టు ఎస్ఐ అప్పలరాజు చేరకుని దర్యాప్తు ప్రారంభించారు.

విశాఖకు పొంచి ఉన్న ముప్పు

... 5వ పేజీ తరువాయి

మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వ్యవసాయ భూమి 0.48 చ.కి.లు, పచ్చదనం 1.24 చ.కి, పరిశ్రమలు 5.94, నగరం 14.2, వృథా భూములు 2.6, నీటి వనరుల ప్రాంతం 7.96 చదరపు కిలోమీటర్ల వైశాల్యం మేర నీట మునగనున్నది. దీంతో విశాఖ పోర్టు, తెన్నేటి పార్కు, రుషికొండ, మంగమారిపేటల్లో సముద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయని ఈ సంస్థ అంచనా వేసింది.

పోర్టు నుంచి మంగమారిపేట వరకూ తీర ప్రాంతం ఇప్పటికే చాలావరకు కోతకు గురై నీట మునిగింది. ఏటా విశాఖ తీరంలో సముద్రం ముందుకువస్తోంది. కోస్టల్ బ్యాటరీ, సబ్‌మెరైన్, వైఎంసీఏ ఎదురుగా సముద్ర తీరం కోతకు గురవుతుంది. ఆర్కే బీచ్‌లో స్కాండిల్ పాయింట్‌కు ఒకప్పుడు సముద్రం చాలా దూరంగా ఉండేదని, ఇపుడు రుతుపవన సీజన్‌లో నీరు తాకుతోందని నిపుణులు గుర్తుచేస్తున్నారు. మానవ అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావంతో పెరిగిన భూతాపం వల్ల సముద్ర మట్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకు ఆసియా దేశాలు మినహాయింపు కాదని ఐపీసీసీ ఇప్పటికే స్పష్టంచేసింది. సముద్ర మట్టాలు పెరగడంతో ముంబై తరువాత ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే నగరం విశాఖేనని తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. సముద్ర మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు పక్కనున్న మేహాద్రిగెడ్డలోకి నీరు ప్రవేశిస్తే ఆ ప్రాంతంలో చెట్లు, మడ అడవులు ముంపునకు గురవుతాయి. ఇంకా సముద్ర నీరు మేహాద్రిగెడ్డ లోపలకు ప్రవేశిస్తే భూగర్భ జలాలు ఉప్పునీటిగా మారతాయి. బీచ్‌రోడ్డు ఇప్పటికే కోతకు గురవుతూనే ఉంది. సముద్ర మట్టాలు పెరిగే క్రమంలో పడనున్నది. ఈ పరిణామం జీవ వైవిధ్యం, పర్యాటక, ఉపాధి రంగాలపై ప్రభావం చూపుతుంది. ఈ సంస్థ చేపట్టిన అధ్యయనం మేరకు 2060కల్లా విశాఖ తీరంలో 1.95 శాతం (13.29 చ.కి.మీ), 2080కల్లా 2.67 శాతం (18.18 చదరపు కిలోమీటర్లు), 2100కల్లా 4.76 శాతం (32.44 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం) భూమి నీట మునుగుతుందని అంచనా వేసింది.

వైసీపీలో ఎమ్మెల్సీ టికెట్ రేస్

... 5వ పేజీ తరువాయి

భావించినా క్రాస్ ఓటింగ్ కారణంగా ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించడంతోపాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా ఇచ్చారు. వంశీకృష్ణశ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని పార్టీకి విధేయుడిగా ఉన్న గురువులుకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయం తర్వాత పరిణామాలు మారిపోయాయి. వచ్చే ఐదేళ్లపాటు పార్టీ తరఫున పోరాటం చేయాలంటే తమకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు బూడి ముత్యాలనాయుడు అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి దాదాపు రూ.వంద కోట్లు వరకూ ఖర్చు పెట్టిన తనను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు ప్రారంభించిందని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పార్టీ నేతల వద్ద వాపోయినట్టు తెలిసింది. వీటని తట్టుకుని నిలబడాలంటే తనకు చట్టబద్ధమైన పదవి ఉండాలని అధిష్ఠానానికి విన్నవించినట్టు సమాచారం. ఐదేళ్లపాటు నిలదొక్కుకోవడానికి మాత్రమే ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ కూడా ఎమ్మెల్సీగా తనకు అవకాశం ఇవ్వాలని, పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వద్ద డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా తాను భారీగా ఖర్చు చేసి కార్యక్రమాలు నిర్వహించానని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలో పార్టీ నేతలందరి అభిప్రాయ సేకరణ జరిపి పార్టీ అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తానని సుబ్బారెడ్డి స్పష్టం చేసినట్టు తెలిసింది. జగన్ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని తనను కలిసిన ఆశావహులకు సుబ్బారెడ్డి చెబుతున్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

జగదాంబ కూడలి, ఆగస్టు 1: వన్‌టౌన్ బురుజుపేట శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం ఆలయంలో నిత్య సేవలతో పాటు త్రికాల పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి దర్శనం కల్పించారు.

'నిరుద్యోగ యువతకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

అక్కయ్యపాలెం, ఆగస్టు 1: ప్రజా సమస్యలపై పోరాడుతున్న నిరుద్యోగ యువతకు చట్టసభల్లో ఎమ్మెల్సీ అవకాశం కల్పించి, ప్రోత్సాహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కూటమి నాయకులను కోరారు. ఎన్నికల ముందు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వందలాది ఉద్యమాలు చేసి పోలీసు కేసులను భరిస్తూ చివరిగా నిరుద్యోగ ఓదార్పు యాత్ర పేరుతో రాష్ట్రమంతా పర్యటించి వైసీపీ ప్రభుత్వ లోపాలను ప్రశ్నించామన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే

విశాఖపట్నం, ఆగస్టు 1: కేకే లైనులోని కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551), విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనెల ఒకటి నుంచి ఏడు వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ పాసింజర్ (08552), కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈనెల రెండు నుంచి ఎనిమిది వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖ నడుస్తాయన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను రద్దు చేశామన్నారు.

టాస్ సేవలకు అభినందన

కంచరపాలెం: టాస్ స్వచ్ఛంద సంస్థ సేవలను సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాస్ అభినందించారు. ఈ మేరకు టాస్ ప్రతినిధులు హరినారాయణ, లక్ష్మి, ప్రకాశ్‌ను గురువారం సత్కరించి, మెమెంటోలను అందజేశారు. గిరి ప్రదక్షిణ రోజు టాస్ సంస్థ ఆధ్వర్యంలో కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వద్ద భక్తుల పాదాలకు నొప్పుల నుంచి ఉపశమనం కల్పించేలా ఆయింట్‌మెంట్స్‌తో మర్దన చేయడం, మందుల పంపిణీ తదితర కార్యక్రమాలను చేశారు.

కేజీహెచ్‌లో తల్లి పాల బ్యాంకు

మహారాణిపేట, ఆగస్టు 1: కేజీహెచ్‌లో త్వరలో తల్లి పాల బ్యాంకును ఏర్పాటు చేయనున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. పిల్లల విభాగంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహిం చారు. తల్లి పాలు ఇచ్చేందుకు వీలుగా గైనిక్ పిడియాట్రిక్ వార్డులలో గదులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా అతిథులు బిడ్డకు తల్లిపాల విశిష్టతను వివరించారు. సమావేశంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

'శివాజీ సేవలు అభినందనీయం'

డాబాగార్డెన్స్, ఆగస్టు 1: సమాజాభివృద్ధికి బుద్ధ శివాజీ అందిస్తున్న సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. డాబాగార్డెన్స్‌లో ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజా సేవకు శివాజీ జీవితం అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో పూసర్ల విశ్వేశ్వరరావు, పాపారావు, మౌర్య, ఆళ్ల గోకుల మురళి, పీలా, తిలక్, నరసింహారావు, ఆడారి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

జ్ఞానాపురం, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం పండగలా సాగింది. జోన్ 5 పరిధిలో జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సచివాయల కార్యదర్శులు ఉదయం 10 గంటలకే 90 శాతం పంపిణీని పూర్తిచేశారు. జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ లబ్ధిదారునికి పింఛను అందించారు. జడ్సీ ఆర్‌జీవీ కృష్ణ, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కబ్ బుల్ బుల్ ఉత్సవం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

మర్రిపాలెం, ఆగస్టు 1: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కబ్ బుల్ బుల్ ఉత్సవాలు 104 ఏరియా శ్రీవిజయనగర్ కాలనీ కేంద్రీయ విద్యాలయం-2 లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ మాజీ ప్రిన్సిపాల్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ డాక్టర్ విజయ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి, క్రమశిక్షణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కృషి చేస్తోందన్నారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో 12 కేంద్రీయ విద్యాలయాల నుంచి 180 మంది విద్యార్థులు, 20 మంది శిక్షణ నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నా రు. ఇందులో భాగంగా క్రమశిక్షణ, సమాజం, దేశంపట్ల బాధ్యత, నిరంతర జాగరూకత, దేశభక్తిని పెంపొందించడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీ-1, 2 ప్రిన్సిపాల్స్ మదీనామాలిక్, సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జగదాంబ కూడలి, ఆగస్టు 1: కేరళ వయనాడ్ తుఫాన్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జగదాంబ జంక్షన్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారని, మరింతమంది నిరాశ్రయులయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధితులకు సహాయం అందించడంలో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకొనేందుకు సీపీఎం పొలిట్ బ్యూరో పిలుపు మేరకు విరాళాలను సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బి.గంగారాం, కుమార్, రాజు, సుబ్బారావు, చంద్రమౌళి, నరసింగరావు, అప్పారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



తిలక్‌కు నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఆగస్టు 1: సమాజంలో మార్పునకు పేదరికం, భూస్వామ్యం, నియంతృత్వ పోకడలపై తన కలం ద్వారా చైతన్యం రగిల్చిన దేవరకొండ బాలగంగాధర తిలక్ చిరస్మరణీయ సాహితీవేత్త అని ఏయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో తిలక్ 103వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఇలాంటి సాహితీ గోష్టులు సమాజానికి అవసరమన్నారు. అధ్యాపకులు డాక్టర్ డి.ప్రవీణ మాట్లాడుతూ తిలక్ కథలు, కవిత్వంలో సమాజంలోని ప్రతి అంశాన్నీ స్పృశించారన్నారు. జి. యోహన్‌బాబు, అధ్యాపకులు నేమాని శారద తిలక్ రచనా విలువలు గుర్తుంచుకోవాలన్నారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డీవీ సూర్యారావు, వెలమల సిమ్మన్న, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో అంతా గుట్టు!

... 5వ పేజీ తరువాయి

జవాబు ఇవ్వరు. 2018 వరకు అన్ని వివరాలు వెల్లడించిన వారికి ఇప్పుడు ఏమిటి సమస్య ఏమిటో చెప్పరు.

ఇంజనీరింగ్ విభాగం కూడా ఎక్కడెక్కడ ఏయే ప్రాజెక్టులు నిర్మిస్తున్నది?, వాటికి అయిన వ్యయం ఎంత?...వంటి వివరాలు కూడా పెట్టేది. ఇప్పుడు వెబ్‌సైట్ చూస్తే పాత వివరాలు తప్పితే కొత్తవి అందులో ఏమీ లేవు. ఆ వెబ్‌సైట్ చూసినవారికి ఇది వందల కోట్ల రూపాయల టర్నోవర్ చేసే సంస్థేనా?...అని అనుమానం కలుగుతుంది. వీఎంఆర్‌డీఏకు అద్దెలు, ప్లాట్ల వేలం ద్వారా ఆదాయం వస్తుంది. ఎక్కడ దుకాణాలు ఖాళీ ఉన్నాయో డిస్‌ప్లే చేస్తే కావలసిన వారు దరఖాస్తు చేసుకుంటారు. అది కూడా రహస్యమే. ఇక విక్రయానికి భూములు ఎక్కడున్నాయో తెలిస్తే కొనాలనుకునేవారు దరఖాస్తు చేసుకుంటారు. ఆ అవకాశం కూడా వెబ్‌సైట్‌లో లేదు. అసలు దానిని జనరంజకంగా తీర్చిదిద్దాలనే ఆలోచన అక్కడ అధికారులకు ఎవరికీ లేదు. వీఎంఆర్‌డీఏకు ప్రత్యేకంగా ఐటీ విభాగం ఉంది. పరిపాలనా వ్యవహారాలు చూడడానికి సెక్రటరీ ఉన్నారు. కానీ ఎవరికీ ఏమీ పట్టదు. కొత్త కమిషనర్ హయాంలోనైనా ఈ ప్రాంత అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ బోర్డు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నదో తెలియజేసే ఏర్పాటు చేస్తారని ఆశిద్దాం.

సెంట్రల్ డ్రగ్ ఫార్మసీ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు

... 5వ పేజీ తరువాయి

మానేశారు. విధుల్లో చేరినప్పుడు ఇచ్చిన సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే, యాజమాన్య ప్రతినిధులు విచిత్రమైన నిబంధనలు పెట్టారు. ఇప్పటివరకూ తాము ఇచ్చిన వేతనం వెనక్కి ఇవ్వాలని, అలాగే హాస్టల్ వసతికి, భోజనానికి డబ్బులు చెల్లించాలని...అప్పుడు సర్టిఫికెట్లు ఇస్తామని మొండికేశారు. ఎంత బతిమాలినా ఇవ్వకపోవడంతో బాధితులంతా దుకాణం ముందు ధర్నా చేపట్టారు. అయినా వారు స్పందించలేదు. దాంతో నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆ ఫిర్యాదును సంబంధిత శాఖ డ్రగ్ కంట్రోల్ అథారిటీకి పంపించారు. వారు విచారించి, అతి తక్కువ మంది పనిచేస్తున్నట్టు లైసెన్స్ తీసుకున్నారని, కానీ అంతకు పదింతల సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తున్నారని, తన పరిధికి మించి ఉండడంతో మరో ఉన్నతాధికారికి విచారణ బాధ్యత అప్పగించాలని కోరారు. ఆ మేరకు జిల్లా అధికారులు అడిషనల్ డ్రగ్ కంట్రోలర్ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనేక అవకతవకలు బయటపెట్టారు. వాటిపై వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దానికి ఆ యాజమాన్యం స్పందించలేదు. ఈ విషయం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు తెలియజేశారు. తక్షణమే వారి లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని, షాపును సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదు చేసిన యువతులకు సర్టిఫికెట్లను వెనక్కి ఇప్పించాలని ఆదేశించారు. ఆ మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు గురువారం సెంట్రల్ డ్రగ్ ఫార్మసీని మూసివేయించారు. మిగిలిన విషయాలపై తదుపరి విచారణ నిర్వహిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు వారం రోజుల పాటు లైసెన్స్ రద్దు చేశారు. ఏ యాజమాన్యమైనా ఉద్యోగులను వేధిస్తే ఫలితం ఇలాగే ఉంటుందని, ఉపేక్షించేదని అధికార వర్గాలు తెలిపాయి.

జగన్‌ను కలిసిన వైసీపీ కార్పొరేటర్లు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేటర్‌తో కలుపుకుని వైసీపీకి 60 మంది కార్పొరేటర్లు ఉండేవారు. వారిలో 12 మంది ఇటీవల టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. మిగిలిన 48 మందిలో 40 మంది కార్పొరేటర్లు రెండు బస్సుల్లో బయలుదేరి తాడేపల్లి వెళ్లారు.

మాజీ సీఎం జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నిక విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. ఎన్నికలో గెలుపొందాలంటే 49 మంది కార్పొరేటర్ల బలం అవసరమని, అంత బలం లేకపోయినప్పటికీ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పోటీకి దిగుతున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావులు వివరించారు. పలువురు కార్పొరేటర్లు పార్టీని వదిలి వెళ్లిపోయిన విషయం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి జగన్ స్పందిస్తూ అధికారం కోల్పోతే ఏ రాజకీయ పార్టీకైనా ఇలాంటి అనుభవం ఎదురవ్వడం సహజమని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయడం సాధ్యం కాదని, ఈ ఐదేళ్లు ప్రజల్లోనే ఉండాలని కార్పొరేటర్లకు సూచించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వారిలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు. ఇదిలావుండగా జగన్‌ను కలిసేందుకు వెళ్లని ఎనిమిది మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరడం ఖాయమంటున్నారు. అదే జరిగితే జీవీఎంసీలో వైసీపీ బలం 40కి పడిపోనున్నది.

విశాఖ క్రికెట్ జట్టుకు వీడీసీఏ అభినందనలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 1: రాష్ట్ర స్థాయి అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్న విశాఖ క్రికెట్ జట్టు ఆటగాళ్లతో పాటు కోచ్, మేనేజర్, సహాయ సిబ్బందిని జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) అభినందించింది. ఫైనల్స్‌లో కృష్ణా జట్టును 433 పరుగుల భారీ తేడాతో చిత్తు చేయడంపై హర్షం వ్యక్తం చేసింది. బ్యాటింగ్‌లో సెంచరీలు, అర్ధ సెంచరీతో రాణించిన వీసీహెచ్.శ్రావణ్ (113), రోహన్ గణపతి (151 నాటౌట్), ఈశ్వర్ వర్ధన్ (87)తో పాటు బౌలింగ్‌లో ప్రతిభ చూపిన కె.భాను శ్రీహర్ష (ఆరు వికెట్లు), గౌతమ్ ఆర్య (నాలుగు వికెట్లు)లను గురువారం ఏసీఏ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వీడీసీఏ ప్రతినిధులు పార్థసారధి, జేకేఎం.రాజు తదితరులు అభినందించారు.

కొండవాలు ప్రాంతాల్లోని శిథిల ఇళ్లను గుర్తించండి

▶▶ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, ఆగస్టు 1 : అధిక వర్షాల నేపథ్యంలో నగరంలో ఉన్న కొండవాలు ప్రాంతాల్లో శిథిల ఇళ్లను గుర్తించి, ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, యూసీడీ అధికారులు, జోనల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించేందుకు ప్లానింగ్ అధికారులు, ఎమినిటీస్ కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సర్వే నిర్వహించాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తం చేయాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు ఆశ్రయం కల్పించేందుకు ముందస్తుగా రిహాబిలిటేషన్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో సర్వే చేసి,అక్కడ శాశ్వత ప్రాతిపదికన అవసరమయ్యే రక్షణ గోడలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు వారి ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు సూచిస్తున్న ప్రతిపాదనలకు అనుగుణంగా అధికారులు సర్వే నిర్వహించుకోవాలని చెప్పారు. ప్రజలకు అందించే సేవల్లో ఎటువంటి లోటుపాటులు లేకుండా సచివాలయాలు, కార్యదర్శుల పనితీరుపై పర్యవేక్షణ చేయాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. ఈ సమావేశంలో పీడీ యూసీ డీ ఫణిరామ్, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, జె. విజయలక్ష్మి, ఆర్‌జీవీ కృష్ణ, బి.సన్యాసినాయుడు, హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు సాంసన్ రాజు, రామ్మోహన్‌రావు, వేణుగోపాల్,గోవింద రావు, కార్యనిర్వాహక ఇంజ నీర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఏపీడీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే వార్షికోత్సవాలు విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, ఆగస్టు 1 : ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే ఈఏడాది జరిగిన వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షికోత్సవాలన్నీ విజయవంతం అయ్యాయని ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అన్నారు. ఉత్సవాల విజయవంతాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగిన తిరు కల్యాణ మహోత్సవం, మేలో జరిగిన చందనోత్సవం, జూన్‌లో సింహగిరి ప్రదక్షిణ విజయవంతంలో దేవదాయ శాఖతో పాటు పోలీసు, జీవీఎంసీ, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలందించారని చెప్పారు. దేవాలయంలోని స్తంభాలపై ఉన్న 32 నారసింహ అవతారాలను, వాటి విశిష్టతను చిత్రీకరించి త్వరలోనే పుస్తకం విడుదల చేస్తామన్నారు. అలాగే గతంలో ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేసిన సహస్ర దీపాలంకరణ సేవను ప్రతి శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయంలో నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో భాగం గా జరిగే తిరువీధి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్వామివారికి సంబంధించిన పుస్తకాలను భక్తులకు అందుబాటులో ఉంచేందుకు వీలుగా పుస్తక విక్రయ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ సీఈ కనకారావు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు, జిల్లా సహాయ అగ్నిమాపక శాఖాధికారి ప్రసాదరావు, విద్యుత్ శాఖ అడిషనల్ ఏఈ రామునాయుడు, దేవదాయ శాఖ ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి జైలు అధికారుల సమావేశం

ఆరిలోవ, ఆగస్టు 1 : కేంద్ర కారాగారంలో ఈనెల 19 నుంచి 21 వరకు జైలు అధికారుల సమావేశాలు జరగనున్నట్టు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్. కిశోర్‌కుమార్ తెలిపారు. ఈమేరకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సమావేశానికి ఎనిమిది రాష్ట్రాల నుంచి జైలు అధికారులు హాజరుకానున్నట్టు తెలిపారు.

నిబంధనల మేరకు పాఠశాల నిర్వహణ

పద్మనాభం, ఆగస్టు 1 : స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తామని పాఠశాల కరస్పాండెంట్ ఆలీవర్ రాయ్ చెప్పారు. కృష్ణాపురంలోని స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తమ పాఠశాలలో ప్రవేశపెట్టిన నైతిక విద్యా బోధన సిలబస్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డీఈఓ ఇచ్చిన సూచనలను పాటిస్తామన్నారు. తల్లిదండ్రుల మనోభావాలను గౌరవిస్తూ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, ఆగస్టు 1 : జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీ, పుష్కరిణి ఫీడర్ల పరిధిలో మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సింహపురికాలనీ,సింహాచలం, ప్రియాగార్డెన్స్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

అతిసారపై అవగాహన

ఆనందపురం, ఆగస్టు 1 : గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అతిసార, హ్యాండ్ వాష్‌పై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జల జీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త ఆనంద్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది హ్యాండ్ వాష్ ఎలా చేసుకోవాలి, అతిసార నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను తెలియజేశారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

సింహాచలం, ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ప్రసాద్ నాయక్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ నర్సింగ్ విభాగాధిపతి డా కె.కృష్ణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. కవిత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిలోవ : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని రైన్‌బో వైద్యురాలు రాగ సుధ అన్నారు. గురువారం ఆమె ఆరిలోవ హెల్త్ సిటీలో ఉన్న రైన్‌బో ఆస్పత్రిలో తల్లి పాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 48 శాతం మంది తల్లులు మాత్రమే పుట్టిన వెంటనే పిల్లలకు పాలు ఇస్తున్నారని, దీన్ని 2025 నాటికి 50 శాతానికి పెంచాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ఎంవీఆర్ శైలజ, నిహారిక, శ్రీలత, నలినీ, రావి శ్రీనివాస్, పద్మకుమార్, దిలీప్, మనోజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డైనింగ్ టేబుళ్లు వితరణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 1 : భీమిలి పట్టణంలో చినజీయర్ స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారిజ అంధుల పాఠశాలకు ఇంటెల్లీ పొలాక్స్ పాఠశాల యాజమాన్యం ఏకాదశి సందర్భంగా బుధవారం డైనింగ్ టేబుళ్లు, 140 మంది విద్యార్థులకు ఐస్‌క్రీమ్‌లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, బ్లైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ శిరీషా, హిమాంశు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 1 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన గురువారం మింది కాలనీలో చోటుచేసుకుంది. కాలనీలో నివాసం ఉంటున్న ఈటి వెంకటరావు, భాగ్యలక్ష్మి దంపతులు ఈనెల 27న విజయవాడలో ఉంటున్న తమ రెండో కుమారుడి వద్దకు వెళ్లారు. ఉదయం ఇంటి పనిమనిషి ఇంటి బయట శుభ్రపరిచేందుకు రాగా మెయిన్ డోర్ గ్రిల్స్‌కు తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గుర్తించి మధురవాడలో ఉంటున్న వెంకటరావు కుమార్తెకు ఆమె పోలీసులకు సమాచారం అందించారు. సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, పలు వెండి వస్తువులు, కొన్ని యూఎస్ డాలర్లు పోయినట్టు వెంకటరావు కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపునకు కృషి

భీమునిపట్నం, ఆగస్టు 1 : విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించడానికి స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ద్వారా ఈనెల 2 నుంచి 15వ తేదీ వరకూ జెండా ఉంఛా రహే హమారా పేరిట భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. రెండ్రోజుల క్రితం సంబంధిత ప్రోమోను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సౌరబ్ గౌర్, ఏయూ ఇన్‌ఛార్జి వీసీ శశిభూషణరావు ఆవిష్కరించారని చెప్పారు. ఈనెల 14న పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా ఉన్న జీవీఎంసీ సెంట్రల్ పార్క్ వేదికగా 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని పది వేల మంది విద్యార్థులతో ప్రదర్శిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, తగిన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గంటా వారికి హామీ ఇచ్చారు.

ఆదర్శ నాయకుడు కామ్రేడ్ రామారావు

వెంకోజీపాలెం, ఆగస్టు 1 : ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ నాయకుడు వీవీ రామారావు కార్మికుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ అన్నారు. గురువారం రామారావు మూడో వర్ధంతి సభ ఇసుకతోట జంక్షన్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కామ్రేడ్ రామారావు విద్యార్థి ఉద్యమంతో పాటు విశాఖలో హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్, విశాఖ స్టీల్, చిట్టివలస జూట్‌మిల్లు నాయకుడిగా అనేక ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డి సత్తిబాబు, వి. జనార్దన్, గండ్రెడ్డి సతీష్, సాయిబాబా, బంగారు నాయుడు, లక్ష్మణ్‌రెడ్డి నాగరాజు, సూర్యనారాయణ, గంగునాయుడు, శివ పాల్గొన్నారు.

తగరపువలస : ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రామారావు మూడవ వర్ధంతి సభ తగరపువలస సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, మావూరి వీర్రాజు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఆగస్టు 1 : నరవ నీటి శుద్ధి కేంద్రం వద్ద విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపి వేయనున్నట్టు జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు ఎస్. శేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జోన్-2లో 8 నుంచి 11 వార్డులతో పాటు ఆరిలోవ, తాటిచెట్లపాలెం ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. జోన్-3లో 12 నుంచి 27 వార్డుల్లో పాత వెంకోజీపాలెం, జోన్-4లో 28 నుంచి 39 వార్డుల్లో దసపల్లా హిల్స్, సాలిపేట, అల్లిపురం తదితర ప్రాంతాలకు, జోన్-5 లో 41 నుంచి 57 వార్డుల్లో రైల్వే న్యూ కాలనీ, అక్కయ్యపాలెం, జోన్-8లో శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంతా పార్కు, బైలర్స్ కాలనీ, వుడా కాలనీ, పవర్ ఆఫీసు ఎదురుగా, ఆర్ఆర్‌వీ పురం, రజకకాలనీ ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అత్యవసరమైన వారికి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. వివరాలకు 8297652049, 9494915740, 6309860485, 9848308813 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

8లోగా పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు

ఆరిలోవ, ఆగస్టు 1 :జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశా లల్లో ఈనెల 8వ తేదీలోగా విద్యా కమిటీ ఎన్నికలు పూర్తి చేయనున్నట్టు సమగ్ర శిక్షాభియాన్ జిల్లా సమన్వయకర్త బి. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలను ఎంఈఓలకు పంపించామన్నారు.

నేత్ర సమస్యల పట్ల అప్రమత్తం

ఆరిలోవ, ఆగస్టు 1 : నేత్ర సమస్యల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల కార్నియా స్పెషలిస్టు డాక్టర్ శిల్ప తరిణి అన్నారు. గురువారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాలలో నేత్ర సమస్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

4న శారీ వాక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దొరబాబు, డాక్టర్ సుధా పద్మశ్రీ

సిరిపురం, ఆగస్టు 1 : బీచ్ రోడ్డులో ఈనెల 4న శారీ వాక్ నిర్వహించనున్నట్టు ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వైసీహెచ్ దొరబాబు, డాక్టర్ సుధా పద్మశ్రీ తెలిపారు. గురువారం సాయంత్రం వారు పాండురంగాపురం రోడ్డులో శారీ వాక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయత ఉట్టిపడేలా చీరకట్టు ప్రాధాన్యం అందరికీ తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, గతేడాది 10 వేల మంది హాజరైన ఈ కార్యక్రమానికి ఇప్పటికే 8 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. 4న ఉదయం 6 గంటలకు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి 3 కి.మీ వరకు వాక్ ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 3,4 తేదీల్లో గాదిరాజు ప్యాలెస్‌లో 30 స్టాళ్లతో చేనేత వస్త్ర ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అప్పన్న సేవలకు రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఆగస్టు 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి, చందన సమర్పణకు గురువారం రూ. 2 లక్షల విరాళాలు అందాయి. నగరంలోని విశాలక్ష్మీనగర్‌కు చెందిన ఎస్.నాగేశ్వరరావు చందన సమర్పణకు రూ.1,00,116, నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.1,00,116లను నగదు రూపంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మెట్ల మార్గంలో మోకాళ్లపై అప్పన్న దర్శనం



మధురవాడ, ఆగస్టు 1 : కూటమి అధి కారంలోకి రావాలని అప్పన్న స్వామికి మొక్కుకున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ గురువారం మెట్ల మార్గంలో మోకాళ్లపై నడిచి మొక్కు చెల్లించు కున్నారు. కూటమి అధికారం చేపట్టాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, భీమిలి నుంచి గంటా శ్రీనివాసరావు అత్యధిక మెజార్టీతో గెలవాలని అప్పన్న స్వామికి మొక్కుకున్నట్టు శివాజీ తెలిపారు.



సుత్తమ్మ తల్లికి నిమ్మకాయలతో అలంకరణ

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 1 : మండలంలోని చిప్పాడ గ్రామంలో సుత్తమ్మతల్లి అమ్మవారిని గురువారం నిమ్మకాయలతో అలంకరించారు.ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు అమ్మవారికి రోజుకో అలంకరణ చేపడుతున్నారు. ఈమేరకు నిమ్మకాయలతో అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సిరుల దేవరకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఆగస్టు 1 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అర్చకులు ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 32, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 26, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారేట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 150, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 42, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	82
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..


చేపలుప్పాడలో పింఛన్ అందిస్తున్న జడ్పీ కనకమహాలక్ష్మి

తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ

భీమునిపట్నం, ఆగస్టు 1 : పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. తెల్లవారుజామున అయిదు గంటల నుంచే అధికారులు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.4వ వార్డు చేపలుప్పాడలో జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందించారు. జోన్ వన్ పరిధిలోని 1 నుంచి 4 వార్డుల్లో మొత్తం 8675 మంది పింఛన్‌దారులు ఉండగా, సాయంత్రానికి 8379 మందికి అందజేశారు. మిగిలిన వారికి శుక్రవారం అందజేస్తామని జడ్పీ తెలిపారు. అలాగే మండలంలో మొత్తం 6161 మంది పింఛన్‌దారులు ఉండగా, సాయంత్రానికి 5922 మందికి పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జానకి తెలిపారు.

ఇసుక లారీలతో దొరతోట రోడ్డు రద్దీ


కృష్ణా కాలనీ రోడ్‌లో నిలిపివేసిన ఇసుక లారీలు

భీమునిపట్నం, ఆగస్టు 1 : పట్టణంలోని కృష్ణాకాలనీలో ఉన్న ప్రభుత్వ ఇసుక డిపోకు వందలాది లారీలు వస్తున్నాయి. దీంతో దొరతోట రహదారిలో రద్దీ నెలకొంటోంది. ఈమార్గంలో సిటీ బస్సులతో పాటు కార్లు, బైకులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి.వీటితోతోడు లారీలు కృష్ణా కాలనీలో ఉన్న ఇసుక డిపో నుంచి రెండు కిలోమీటర్ల పొడవున గొల్లలపాలెం వరకూ రహదారి పక్కన క్యూ కడుతున్నాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటపుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు లైన్ల రహదారి కావడంతో ఇరుగ్గా తయారైంది. ఈ రహదారిని 150 అడుగులకు విస్తరించాలని మాస్టర్ ప్లాన్‌లో వున్నా, ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితమైంది. అంతేకాకుండా గొల్లలపాలెం వద్ద జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వుంది. ఆ పాఠశాల వద్ద కూడా లారీలు వరుసగా వుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్‌లో ప్రత్యేకంగా ఒక ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేయాలని లేదా స్కూల్ వద్ద కొంత ఖాళీ విడిచి లారీలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నామినేటెడ్ పదవులకు యత్నం

సింహాచలం, ఆగస్టు 1 : రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేపట్టడంతో సింహాచలం దేవస్థానం పాలక మండలిలో స్థానం కోసం ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే కొందరు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి తమకు ట్రస్టీగా అవకాశం కల్పించాలని వినతులు అందజేయగా మరికొందరు రాష్ట్ర హోం మంత్రి అనితను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నారు. దీంతో అప్పన్న ఆలయ ట్రస్టీ పదవికి పోటీ అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా 98వ వార్డు టీడీపీ మాజీ అధ్యక్షుడు మేకా కాసుగోపాల్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ కార్పొరేటర్ నరసింహం కూడా గంటాకు లేఖ ఇచ్చారు.అలాగే సింహాచల దేవస్థానంలో ఏఈఓగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీవైష్ణవ సామాజిక వర్గానికి చెందిన ఒకరు తనకు ట్రస్టీగా అవకాశం కల్పించాలని కోరుతూ పార్టీ నేతల ద్వారా తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఏదిఏమైనా నామినేటెడ్ పదవులకు ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాల పట్ల హర్షం

భీమునిపట్నం, ఆగస్టు 1 :ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు డబుల్ ధమాకా ప్రకటించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సొంతిల్లు వుండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. పట్టణాల్లో నివసించే వారికి రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలన్న ప్రతిపాదన అభినందనీయమన్నారు. అలాగే గృహ నిర్మాణానికి రూ. 4 లక్షలు ప్రకటించడం హర్షనీయమన్నారు.

ఇంటర్‌లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, ఆగస్టు 1 : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో చేరడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని అంబేడ్కర్ గురుకులాల డీసీఓ రూపావతి అన్నారు. గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 28లోగా కళాశాలలో సంప్రతించాలన్నారు. ఎస్సీ కేటగిరీ విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం అని చెప్పారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆనందపురం, ఆగస్టు 1 : చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ తిరుమలరావు తెలిపారు. గ్రామానికి చెందిన పొంద్రంకి ప్రసాద్‌కు విజయనగరం జిల్లా ముడిదాం గ్రామానికి చెందిన లావణ్యతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. అత్త మామ అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తుండడంతో నెల రోజుల క్రితం లావణ్య పురుగుల మందు తాగింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. నెల రోజుల పాటు చికిత్స పొందిన ఆమె బుధవారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి బంగారులక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.